మెడికోవర్ ఫ్యామిలీ కార్డు కలెక్టర్‌చే ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ మరియు మెడికోవర్ మేనేజ్‌మెంట్ (డాక్టర్ కె తిరుమల ప్రసాద్ & సెంటర్ హెడ్ ఎస్ మల్లికార్జున రెడ్డి) మెడికోవర్ ఫ్యామిలీ కార్డ్‌ని బుధవారం ప్రారంభించారు. 500 రూపాయలు చెల్లించి కార్డు పొందిన వారికి ఒక సంవత్సరం 5 మంది సభ్యులు పలు రాయితీలు పొందవచ్చునని తిరుమల మెడికల్ ఆసుపత్రి ఎండి తిరుమల ప్రసాద్ తెలిపారు. ఓ.పి.సంప్రదింపులపై 25 శాతం తగ్గింపు ఉంటుందని, ఒపి పరిశోధనలపై 15శాతం తగ్గింపు లభిస్తుందని పేర్కొన్నారు. నగదు ప్రవేశాల కోసం ఐ.పి. మరియు డే-కేర్ సేవలపై 10శాతం తగ్గింపు (ఫార్మసీ, వినియోగ వస్తువులు, స్టెంట్‌లు మినహాయించి) లభిస్తుందని తెలియజేశారు. బీమా రోగులకు వైద్యేతర సేవలపై 50 శాతం తగ్గింపు ఉంటుందని, రూ.5,000 కంటే ఎక్కువ ఉన్న ఫార్మసీ సింగిల్ బిల్లుపై 20శాతం తగ్గింపు ఉంటుందని వివరించారు. ముందుగా ఉన్న ఆరోగ్య తనిఖీ ప్యాకేజీలపై 10శాతం తగ్గింపు లభిస్తుందని తెలియజేశారు.

పేదల భూ సమస్యలను పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అంబేద్కర్

విశాలాంధ్ర-గుర్ల: పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై దృష్టి సారించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వీలైనంతవరకు తక్షణ పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. గుర్ల మండలం దేవునికణపాకలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలనుంచి వచ్చిన వినతులను కలెక్టర్ పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలోని గిరిజన రైతులు చాలా ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలిచ్చి తమను హక్కుదారులను చేయాలని కోరారు. అలాగే కొంతమందికి పట్టా ఉన్నప్పటికీ, భూమిని అప్పగించలేదని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ఆ భూమికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు.

గ్రామం లోని సమస్యను తాసిల్దార్ ఆదిలక్ష్మి వివరించారు. వచ్చిన వినతుల్లో అవకాశం ఉన్నవాటిని తక్షణమే పరిష్కరించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు ఇద్దరు రైతుల పాస్ పుస్తకాలను అప్పటికప్పుడే మార్చి, వచ్చిన వినతుల్లో రెండింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. అదేవిధంగా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఉన్న స్థల సమస్యను పరిష్కరిం చాలని కలెక్టర్ సూచించారు. ఈ సదస్సులో తాసిల్దార్ వి.ఆదిలక్ష్మి, ఏఓ తిరుపతిరావు, డిప్యూటీ తాసిల్దార్ పి.నారాయణమ్మ, మండల సర్వేయర్ బి.శివ, ఆర్ఐ దుర్గా ప్రసాద్, సర్పంచ్ పివి సూర్యనారాయణరాజు, ఇతర మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం నగరపాలక సంస్థ కు మరో అరుదైన రాష్ట్ర అవార్డు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం నగరపాలక సంస్థ సిగలో మరో రాష్ట్ర అవార్డు సింగారించుకోనుంది. ఇంధన పొదుపు విషయంలో సంస్థ చేసిన విశేష కృషిని గుర్తింపు గా సిల్వర్ అవార్డుకు ఎంపిక అయింది. State Energy Conservation Award (SECA-2024) పేరిట సిల్వర్ అవార్డును ఆంధ్రప్రదేశ్ ఇంధన పొదుపు మిషన్ విజయనగరం నగరపాలక సంస్థకు ప్రకటించింది. ఇందు నిమిత్తం అవార్డు స్వీకరణ కోసం ఈనెల 20న విజయవాడకు రావలసిందిగా ఆహ్వానం అందింది. 20వ తేదీన విజయవాడలోని వివాంటా హోటల్లో వైభవంగా నిర్వహించనున్న కార్యక్రమంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ అవార్డును అందుకోనున్నారు. రాష్ట్రంలో 123 పురపాలక మరియు నగరపాలక సంస్థల కేటగిరిలలో జరిగిన ఎంపికకై తాడిపత్రి పురపాలక సంఘం గోల్డ్ అవార్డుకు ఎంపిక కాగా, విజయనగరం నగరపాలక సంస్థకూ సిల్వర్ అవార్డు వరించింది. ప్రధానమంత్రి స్వానిధి పథకం అమలులో విశేష సేవలకు గుర్తింపుగా ఈ మధ్య విజయనగరం నగరపాలక సంస్థకు అవార్డు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మరో రాష్ట్ర అవార్డు రావడం అందరి సమిష్టి కృషి ఫలితం అని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. తమ కార్యాలయం మేడపైన ఏర్పాటుచేసిన సౌర విద్యుత్ ప్లాంటు మరమత్తులకు గురైందని విషయాన్ని గుర్తించిన తాము తక్షణం యుద్ధ ప్రాతిపదికన సౌర విద్యుత్ ప్లాంట్ ను బాగు చేయించామన్నారు. ఇంధన పొదుపు నేపథ్యంలో ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ఇంధన సంస్థ సిల్వర్ అవార్డును ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే ప్రజలు కూడా సూర్యఘర్ పథకం ద్వారా సౌర శక్తిని వినియోగించుకుని గృహావసరాల నిమిత్తం సోలార్ ప్లాంట్లను విరివిగా నెలకొల్పు కోవాలన్నారు. వాటి ఏర్పాటును ప్రోత్సహిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూర్య ఘర్ పేరిట రాయితీలను కూడా కల్పిస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.విజయనగరం నగరపాలక సంస్థకు అవార్డులు లభించడానికై ముందుండి నడిపిస్తున్న గౌరవ జిల్లా కలెక్టర్ వారికి,జిల్లా యంత్రాంగానికి ,ప్రజా ప్రతినిధులకు, పాలక వర్గానికి మరియు సహకరిస్తున్న ప్రజానీకానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

అక్రమ మైనింగ్ పై విజిలెన్స్ దాడులు

వాహనాలు సీజు, కేసు నమోదు

విశాలాంధ్ర-రాజాం: ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి. ప్రసాదరావు మాంగనీస్ ఖనిజంను అక్రమముగా త్రవ్వి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రాజాం మండలం లోని గార్రాజు చీపురుపల్లి గ్రామం వద్ద విజిలెన్స్ అధికారులు, సిబ్బంది, విజయనగరం జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు, రాజాం మండల రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా ఆకస్మిక తనికీలు చేయగా ఆ ప్రదేశంలో అక్రమ మైనింగ్ చేస్తూ ప్రొక్లైనర్ తో త్రవ్వి ట్రాక్టర్ తో రవాణా చేస్తుండగా అదికారులు ప్రొక్లైనర్, మాంగనీస్ తో నిండి ఉన్న ట్రాక్టర్ ను పట్టుకోని సీజ్ చేయడం జరిగింది. దీనికి కారకులు అయిన చింతగుంటి డిల్లేశ్వరరావు, తోట జోషఫ్, బురాడ సురేశ్ లపై క్రిమినల్ కేసు రాజాం పట్టణ పోలీసు స్టేషన్ నందు నమోదు చేపించడం జరిగింది. ఈ తనిఖిలలో విజిలెన్స్ అదికారులు అయిన డి. సతీశ్ కుమార్ సి.ఐ. ఎం. సురేశ్ కుమార్ ఏ.జీ. విజయనగరం జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారులు అయిన సి. మోహనరావు డి.డి. ఎస్. రాంబాబు ఆర్.ఐ., స్థానికి గ్రామ రెవెన్యూ అదికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి అయిన ప్రసాదరావు మాట్లాడుతూ మాంగనీస్ ఖనిజాన్ని ఎవరైనా అక్రమముగా త్రవ్వడం గాని, రవాణా చేస్తున్న వారిపైన నిరంతరంగా నిఘా పెడుతున్నామని, అక్రమాలకు పాల్పడితే వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు.

సత్య డిగ్రీ,పీజీ కళాశాలలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నగదు బహుమతి

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ : సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కోచ్ కె. సంతోష్ కుమార్ ఆధ్వర్యం లో కరాటే లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు కె.శివ గణేష్, పి.కుశ్వంత్‌కుమార్, బి. రేస్వంత్, పి. హేమంత్, ఎం. హర్ష వర్ధన్ లు ఈ నెల 27, 28 వ తారీఖులలో ఖరఘ్ పూర్, పశ్చిమ బెంగాల్ లో గీతాంజలి ఇండోర్ స్టేడియం లో ఖరగ్ పూర్ యువ కరాటే అకాడమీ కెన్యు రీయు కరాటే అసోసియేషన్, బెంగాల్ ఆధ్వర్యం లో జరగబోయే 24 వ జాతీయ జపాన్ కెన్యు రీయూ ఓపెన్ కరాటే చాంపియన్షిప్ లో పాల్గొనడానికి వెళుతున్నారు. ఈ సందర్భంగా సత్య విద్యా సంస్థల సంచాలకులు. డాక్టర్ మజ్జి శశిభూషణరావు చేతుల మీదుగా ఈ విద్యార్థులకు 10,000/- రూపాయలు నగదును విద్యార్థులను ప్రోత్సహిస్తూ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం. ఉదయ్ కిరణ్, కరాటే కోచ్ శ్రీ. కె. సంతోష్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ లో నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి : సీపీఐ

సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : ఇందిరమ్మ కాలనీలో జరుగుతున నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై కలెక్టర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో బలిజిపేట రోడ్డు వద్ద ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్నటువంటి భూ కబ్జాలు. నకిలీ ఇళ్ల పట్టాలు తయారు చేస్తున్నటువంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న నకిలీ పట్టాల వ్యవహారంపై కలెక్టరేట్లో ఫిర్యాదు చేయడం జరిగిందని. ఈ నకిలీ పట్టాల వ్యవహారం పై స్థానిక పోలీస్ స్టేషన్ అధికారి కి దర్యాప్తు చేయమని కలెక్టరేట్ నుండి ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటని ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇదే నకిలీ పట్టాల వ్యవహారంపై స్థానిక తహశీల్దార్ వారికి కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని. ఇందిరమ్మకాలనీలో గతంలో కొంతమంది రాజకీయ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వారి ఇష్టానుసారంగా పెద్ద పెద్ద డూప్లెక్స్ ఇల్లు నిర్మించి లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని సందర్భంగా గుర్తుచేశారు. వైయస్సార్ ప్రభుత్వం అధికారం ఉండేటప్పుడు ఏదో తూతూ మంత్రంగా ఒక కమిటీని వేసి చేతులు దులుపుకున్నారని ఇప్పటికైనా ఈ కూటమి ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్నటువంటి భూకబ్జాలు నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని. ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని పేదలకు ఇల్లు స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. భూకబ్జాలపై గతంలో స్పందించిన రెవెన్యూ యంత్రాంగం ఏదైతే ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురయ్యాయో అటువంటి స్థలాలపై ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని కొంతమంది భూకబ్జాదారులు అధికార పార్టీ నాయకులు పేర్లు చెప్పుకొని ఆ యొక్క ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను పక్కనపెట్టి యధాతథంగా ఇళ్ల కట్టడాలు చేపట్టారని. ప్రభుత్వం ఇచ్చిన స్థలం కంటే మరికొంత ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేసి డూప్లెక్స్ భవనాలను నిర్మించుకున్నారని. వాటిపై వెంటనే రెవెన్యూ యంత్రాంగంకఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ కాలనీ లో జరిగినటువంటి భూ కబ్జాలు. నకిలీ పట్టాల వ్యవహారంపై కోర్టు ను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం శ్రీనివాస్. పట్టణ నాయకులు వై బాబ్జి. కే వెంకట సత్యనారాయణ. ఎం సింహాచలం కే రాములు పాల్గొన్నారు

గమనిక: ఇందిరమ్మ కాలనీలో కొంతమంది భూ కబ్జాదారులు తప్పుడు ఇల్లు పట్టాలను సృష్టించి కొంతమంది వ్యక్తులకు అమ్ముతున్నారు. దయచేసి ప్రజలు ఎవరు ఇలాంటి తప్పుడు పట్టాలతో ఉన్న ఇల్లును ఇళ్ల స్థలాలను కొనొద్దు భారత కమ్యూనిస్ట్ పార్టీ తరపున ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

చీపురుపల్లి తాసిల్దార్ రాజారావు

విశాలాంధ్ర-చీపురుపల్లి : రైతు సంక్షేమం అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం కృషి జరుపుతుందని చీపురుపల్లి తాసిల్దార్ ఎం రాజారావు అన్నారు. మీ భూమి మీ హక్కు నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన గ్రామ రెవెన్యూ సదస్సులో భాగంగా బుధవారం నాడు చీపురు పల్లి మండలం నడిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. మీ భూమి మీ హక్కు నినాదంతో ప్రజల భూముల రక్షణ కల్పించే విధంగా ల్యాండ్ గ్రాఫింగ్ యాక్ట్ 2024ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగానే గ్రామ సదస్సులు నిర్వహించి గ్రామాలు వారిగా భూ సమస్యల పైన రైతుల నుండి ఫిర్యాదును స్వీకరిస్తున్నామన్నారు. భూ సమస్య పైన బాధిత రైతులు ప్రభుత్వం చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకొని కార్యక్రమంలో భాగంగా పరిష్కారం చేపడతామన్నారు. భూమి కొలతల్లో తేడాలు సర్వే నెంబర్లలో మార్పులు వారసత్వం పేర్లు నమోదు సరిహద్దు సమస్యలు తేడాలు ఏమైనా ఉంటే ఈ గ్రామ సభల్లో రైతులు ఫిర్యాదులు చేయాలని ఈ సందర్భంగా ఆయన రైతులకు వివరించారు. రీ సర్వేల కారణంగా రికార్డు నమోదైన తప్పులు, కబ్జాలు కారణంగా కోల్పోయిన భూములు, అసైన్డ్ భూములు చుక్కల భూములను కూడా ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా ఫిర్యాదు స్వీకరించి పరిష్కార మార్గం చూపుతామన్నారు. మండలంలో ఇప్పటివరకు గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా 600కు పైగా వినతులు రైతుల నుంచి స్వీకరించామన్నారు. ఫిర్యాదులను పరిశీలించి మండల స్థాయిలో పరిష్కారానికి నోసుకొన్న సమస్యలను పరిష్కరించి జిల్లాస్థాయిలో పరిష్కరించదగినవి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్, వీఆర్వో అప్పారావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు

ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-లక్కవరపుకోట: భూ సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం రంగరాయపురం, వెంకన్నపాలెం గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయిలో ఈనెల 6 నుంచి వచ్చే నెల 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం తద్వారా వచ్చిన సమస్యలు పరిష్కారం చేయడం కోసం మండల తహసిల్దార్ సారధ్యంలో మండల సర్వేయర్, మండల పర్యవేక్షకులు, వీఆర్వోలు, అవసరమైన చోట ఇతర ప్రభుత్వ అధికారులు బృందంగా ఏర్పడి సమస్యల స్వీకరించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి రాష్ట్రస్థాయి అధికార బృందం ఏర్పడి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి భూ సమస్యల పరిష్కారానికి మార్గం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సర్వే పేరిట భూ సమస్యలు సృష్టించి రైతులకు ఇబ్బందులు పెట్టారని అటువంటి ఇబ్బందులు తొలగించడం కోసం ఈ కార్యక్రమంలో రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే దృష్టికి, తహసీల్దార్ దృష్టికి సదస్సు ముఖంగా లక్కవరపుకోట, రంగారాయపురం గ్రామ సరిహద్దుల సమస్యను లిఖితపూర్వకంగా మాజీ జడ్పిటిసి సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు తీసుకువచ్చారు. గ్రామ సరిహద్దులు గుర్తించి సమస్యను పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపడతామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు గ్రామ పెద్దలు, మండల సర్వేయర్ సిహెచ్ వెంకట్రావు, హెచ్ డి టి రమేష్, ఆర్ ఐ సన్యాసిరావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పెరగనున్న భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు

జనవరి 1నుంచి అమలుకు కూటమి సర్కార్ ఏర్పాట్లు

మార్కెట్ ధరలను పెంచనున్న రిజిస్ట్రేషన్‌ల శాఖ

విశాలాంధ్ర-జామి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు భారీ షాక్ ఇవ్వనుంది. ఇప్పటి వరకు జిల్లాలోని ముఖ్యకూడళ్ళలలో సైతం మార్కెట్ ధరలు భారీగా ఉన్నా రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం తక్కువగా నమోదు చేయడం జరిగింది. ఉదాహరణకు జామి మండల కేంద్రంలో ఎకరా భూమి ధర రూ.50లక్షల నుంచి ప్రాంతాల వారీగా చూస్తే కోటి రూపాయల వరకు ధర పలుకుతోంది. కానీ రిజిస్ట్రేషన్ ధరల ప్రకారం ఎకరా 20లక్షలు లోపే ఉంది. అలాగే వ్యవసాయ భూములలో నిభందనలను పాటించకుండా భారీ భవనాలను, వివిద రకాల దుఖాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా వుండగా పలు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండానే లేఅవుట్‌లను వేసి అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వానికి తక్కువ ఆదాయం వస్తోంది. ఈనేపథ్యంలో మార్కెట్ ధరలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రిజిస్ట్రేషన్‌ల చార్జీలు భారీగానే పెరగనున్నాయని చెప్పవచ్చు.

నూతన చార్జీల అమలుకు ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వం నూతన చార్జీలను జనవరి 1నుంచి అమలు చేసేందుకు సిద్దమయింది అందులో భాగంగా ఈనెల 20న పెంచిన మార్కెట్ విలువలను ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో నోటీసు బోర్డులలో పెడతారు. 24వ తేదీ వరకు ప్రజల అభ్యంతరాలను స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలించి, 27న మార్కెట్ ధరలను ప్రభుత్వ పరంగా నిర్దారణ చేసి తుది జాబితాను వెలువరిస్తారు. ఇప్పటికే జిల్లా అధికారులకు రాష్ట్ర అధికారులనుంచి ఉత్తర్వులు అందినట్లుగా తెలిసింది. దీనిపై జిల్లాలో అధికారులు జాబితాలను తయారు చేసే పనిలో నిమగ్న మయ్యారు. ప్రభుత్వ నిర్ణయం అమలు జరిగితే జనవరి 1నుంచి రిజిస్ట్రేషన్ బాదుడు తప్పదు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులపై ఫిర్యాదు: సర్పంచ్ క్రాంతి కుమార్

విశాలాంధ్ర -దత్తిరాజేరు: మండలంలోని తిమిటేరు బూర్జివలస గ్రామ సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులపై ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ కు బుధవారం ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా తన సంతకాన్ని పోర్జరీ చేసి 12 పనులకు తీర్మానాలు చేశారని ఆరోపించారు. తక్షణమే ఉపాధి హామీ ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ ,ఫీల్డ్ అసిస్టెంట్ ల పై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామసభ తీర్మానం లేకుండా పనులు ఎలా చేపడ తారని అన్నారు. ఆగస్టులో జరిగిన గ్రామసభలో తాము పనులు తీర్మానం చేసి ఇచ్చినప్పటికీ అవి కాకుండా వేరే పనులు చేపట్టడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవతో సంతకాలు ఫోర్జరీ చేసిన పనులు చేపడుతున్న వాటిని ఆపాలని, ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట, మజ్జి అప్పలనాయుడు, గురునాయుడు, రంభ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

21న అయిదు సాగునీటి ప్రాజెక్టు కమిటీల ఎన్నిక

విశాలాంధ్ర- విజయనగరం: జిల్లాలోని ఐదు సాగునీటి ప్రాజెక్టు కమిటీలకు ఈ నెల 21న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు ఫారమ్ 2 సి ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. డెంకాడ ఆనికట్టు సిస్టమ్, డెంకాడ, ఆంధ్ర రిజర్వాయర్ ప్రాజెక్టు, ఆంధ్ర, తాటిపూడి రిజర్వాయర్ ప్రాజెక్టు, తాటిపూడి, పారాది ఆనికట్, పారాది, శ్రీ గొర్లె శ్రీరాములనాయుడు రిజర్వాయర్ ప్రాజెక్టు స్టేట్-1, మద్దువలసలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఆరోజు ఉదయం 9 నుంచి 12.30 వరకు జరిగే ఈ ఎన్నికల ప్రక్రియలో, ఇటీవల సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొని, తమ ప్రాజెక్టు కమిటీకి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలకు సూపరింటిండెంట్ ఇంజనీర్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు, ఇద్దరు ప్రత్యేక ఉప కలెక్టర్లను ఎన్నికల అధికారులుగా నియమించారు.

యువత చైతన్యవంతమైన వినియోగదారులుగా మారాలి : భీశెట్టి బాబ్జి

వినియోగదారుల వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర- విజయనగరం రూరల్: దేశవ్యాప్తంగా యువత చైతన్యవం తమైన వినియో గదారు లుగా మారినప్పుడే కల్తీలు, మోసాలు అడ్డుకునే అవకాశం ఉంటుందని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు డిసెంబర్ 24 జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల చైతన్య సదస్సు ని స్థానిక సుజాత జూనియర్,డిగ్రీ కాలేజీ లో ప్రారంభించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ మార్కెట్‌లో జరుగుతున్న కల్తీలు, మోసాలు, అబద్ధపు ప్రకటనల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని 1986 వినియోగదారుల రక్షణ చట్టాన్ని భారత ప్రభుత్వం దేశప్రజలకు అందిస్తూ సత్వర న్యాయం కోసం తగిన చర్యలు తీసుకుందని, సవరించిన వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం కేంద్ర ప్రభుత్వం న్యాయం శులభతరం చేసిందని అన్నారు,ప్రతి వినియోగదారుడు తన హక్కులతో పాటుగా బాధ్యతలు తెలుసుకోవాలని, మార్కెట్ లో వంద రూపాయలు దాటి కొన్న ప్రతి వస్తువకి ప్రతి విని యోగదారుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. కాలేజీ విద్యా ర్థులు ప్రదీప్ నగర్ లో ఉన్న జిల్లా వినియోగదారుల ఫోరమ్(న్యాయం స్థానం) ని సందర్శించి పిర్యాదు ఎలా చెయ్యాలో తెలుసుకోవాలని, దేశవ్యాప్తంగా జిల్లా లోని,రాష్ట్రంలో, జాతీయస్థాయిలో వినియోగదారుల ఫోరం (న్యాయస్థానం)లను ప్రభుత్వం ఏర్పాటుచేసి దగాపడ్డ వినియోగదారుల కి దన్నుగా ఉండేలా చేసిందని అన్నారు.ఈ సమావేశంలో పౌరవేధిక ఉపాధ్యక్షులు రొంగలి పోతన్న,సహాయ కార్యదర్శి పొన్నాడ కనకాచారి, మాతృభూమి సేవా సంఘం నేత ఇప్పలవలస గోపి,కాలేజీ కరస్పాండెంట్ బి.ఏ.రావు, తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులకి బహుమతులు అందజేశారు.

ఘనంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు

శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి



విశాలాంధ్ర -వేపాడ: కేంద్ర పౌర విమానయాన మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు 38వ జన్మదిన వేడుకలను శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహిం చారు. లక్కవరపుకోటలోని తన కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని తెలుగుదేశం పార్టీని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చెందేలాగా ఆయన కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పల ప్రసాద్. ఎల్.కోట మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు,ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్ నాయుడు,లగుడు తిరుపతిరావు, రాయవరపు రవి, డెక్క దేముడు నాయుడు, ఖాసాపేట సర్పంచ్ కోళ్ళ భూపాల్ నాయుడు,తెలుగు యువత అధ్యక్షులు లాలం చంద్రశేఖర్, పిల్లా అప్పలరాజు, యూనిట్ ఇంచార్జ్ అక్కిరెడ్డి వెంకటరమణ,పెదగాడ రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బగ్గాంలో సీఎం సహాయనిధి చెక్కు అందచేత



విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని కొత్త బగ్గం గ్రామానికి చెందిన లంక ఈశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకొని వెళ్లారు అనంతరం ఆయన తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 62 288 రూపాయల చెక్కును బుధవారం శ్రీనివాస్ తండ్రి కొండపల్లి కొండలరావు చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్ మీసాల జానకి రావు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

స్కిల్ కమిటీ సమావేశంలో కలెక్టర్ డా.అంబేద్కర్



విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో పండించే వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా విధానాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పండించే వరి, మామిడి, మొక్కజొన్న వంటి వ్యవసాయ ఉద్యాన ఉత్పత్తులను ఆధారం చేసుకొని పరిశ్రమలు ఏర్పాటుచేయడంపై జనవరి మొదటివారంలో పారిశ్రామిక సదస్సు నిర్వహించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఈ సదస్సు ద్వారా ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తల్లో అవగాహన కలిగించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ పొందిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం జిల్లాలోని మూడు డివిజన్ కేంద్రాల్లోనూ మెగా ఉద్యోగమేళాలు నిర్వహించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనే ఆసక్తి వున్నవారికి పరిశ్రమలు నెలకొల్పడంపై శిక్షణ కార్యక్రమాలు నిపుణుల ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్.సి., ఎస్.టి.యువత, మహిళలు, దివ్యాంగులు తదితర వర్గాల వారికోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ చక్రవర్తి, స్కిల్ డెవలప్ మెంట్ జిల్లా మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఉద్యానశాఖ డి.డి. జమదగ్ని, వ్యవసాయశాఖ డి.డి. అన్నపూర్ణ, ఎల్.డి.ఎం. రమణమూర్తి, ఐ.టి.ఐ.కన్వీనర్ వి.వి.గిరి, సిపిఓ పి.బాలాజీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



విశాలాంధ్ర-నెల్లిమర్ల: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నెల్లిమర్ల తహసిల్దార్ బి. సుదర్శనరావు మండల ప్రజలకు సూచించారు నెల్లిమర్ల మండలంలో మొత్తం అనుసంధానమైన గ్రామాలతో కలిసి 33 గ్రామాలు ఉండగా అందులో 8 గ్రామాలలో ఇప్పటివరకు రెవిన్యూ సదస్సులు నిర్వహించారని అందుకుగాను 53 ఫిర్యాదులు వచ్చాయని వాటిపై ఆయా ఫిర్యాదుదారులకు వివరణలు ఇవ్వడం జరిగిందని వాటి పరిష్కారానికి ప్రభుత్వం యంత్రాంగం పనిచేస్తుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తారీఖు వరకు జరుగుతాయని మీ గ్రామాలలో సదస్సులు జరిగినప్పుడు రెవెన్యూ సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందించాలని తెలియజేశారు. ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించిన గ్రామాలలో ప్రజలు స్వేచ్ఛగా తమ యొక్క భూ సమస్య వివరాలను అందిస్తున్నారు అన్నారు.

TENDER NOTICE

ATC-VIII TO BE HELD AT RAGHU ENGINEERING COLLEGE, DAKAMARRI FROM 11 JAN TO 20 JAN 2025

Tenders in sealed covers are hereby called for supply of Dry Ration to Annual Training Camp-VIII to be held at Raghu Engineering College, Dakamarri from 11 Jan to 20 Jan 2025. Last date of the Tender received to this Office by 27 Dec 2024. The tender be dropped at the under mentioned address.

2(A) Girls Bn NCC
D.No. 25-12-12A, Oruganti Vari Thota
Dasannapeta
Vizianagaram - 535 002.

Camp Commandant
ATC-VIII
Raghu Engineering College
Dakamarri

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-రాజాం : రాజాం మున్సిపాలిటీ పరిధి పాలకొండ మెయిన్ రోడ్లో మంచినీటి సరఫరా అయ్యే పైపు లైన్ మరమ్మతులకు గురి అయినందువలన, ఆ పైపులైన మరమ్మత్తులు చేయుటకై మంచినీటి సరఫరా నిలుపుదల చేయడం అయినది. ఈ క్రింద దిగువ తెలుపబడిన ప్రాంతాలకు మాత్రమే నీటి సరఫరా అంతరాయం కలుగుతున్నది. పొనుగుటవలస, అంబేద్కర్ కాలనీ, విద్యానగర్, వరలక్ష్మీ నగర్, మారుతి నగర్ 2,3,4,5 వ లైన్లో మాత్రమే మంచినీటి సరఫరా ఉండదు కావున ఆయా ప్రాంత ప్రజలు గమనించగలరని, ఈ ప్రాంతాలలో మున్సిపాలిటీ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు సప్లై చేయబడుతుందని మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు తెలిపారు.

బ్రహ్మశ్రీ ఆరవెల్లి రామాచార్యులకు జ్యోతిష్య ప్రవీణ సర్టిఫికెట్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలోని దాసన్నపేట శ్రీ చిన్న ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఆరవెల్లి రామాచార్యులు జ్యోతిష్య ప్రవీణ సర్టిఫికెట్ పొందారు. విశాఖపట్నం విశాలాక్షి నగర్ బివికె జూనియర్ కళాశాల లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు . కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఐడి ఎ ఎస్.ఐసిఏఎస్ డా. ఎం. ఆంజనేయులు ఐడి ఎఎస్, ఐసిఏఎస్ , జాతీయ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఐసిఏఎస్ చైర్మన్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు లో చేతులమీదుగా అందుకున్నారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆస్ట్రాలజిస్టులు జ్యోతిష్య ఎం ఆంజనేయులు తదితరులు జ్యోతిష్య శాస్త్రం లో గల పలు అంశాలను ప్రసంగాలలో ఆహుతులకు తెలిపారు.

డిజిపి నుండి ప్రశంసలు పొందిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లాలో ముగిసిన జాతీయ లోక్ అదాలత్ లో రాష్ట్రంలోనే అత్యధిక కేసులను పరిష్కరించిన జిల్లాగా పోలీసుశాఖ ద్వితీయ స్థానం సాధించిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. లోక్ అదాలత్లో 5345 కేసులను పరిష్కరించుటలో క్రియాశీలకంగా పని చేసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, డిసిఆర్బి ఎస్ఐ కే.రాజేష్, నెల్లిమర్ల హెడ్ కానిస్టేబులు కే.సన్యాసి నాయుడు, 2వ పట్టణ కానిస్టేబులు ఐ.శ్రీనివాసరావు లను రాష్ట్ర డిజిపి శ్రీ సిహెచ్. ద్వారకా తిరుమలరావు తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, లోక్ అదాలత్లో పరిష్కారానికి అర్హత కలిగిన కేసులను ముందుగా గుర్తించి, ఆయా కేసుల్లో ఫిర్యాదిదారులు,కక్షిదారుల మధ్య సమన్వయం సాధించేందుకు క్షేత్ర స్థాయిలో చక్కని ప్రణాళికతో పని చేసామన్నారు. న్యాయస్థానాల విలువైన సమయాన్ని ఆదా చేయడంతోపాటు, స్వల్ప వివాదాలు, క్షణికావేశంపై నమోదైన కేసుల్లో ఇరు వర్గాలను డిసెంబరు 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ నందు ప్రవేశ పెట్టడంతో, న్యాయస్థానం ముందు హాజరై, ఇరువర్గాలు రాజీ పడినట్లుగా వెల్లడించడంతో 5345 కేసులను పరిష్కరించామన్నారు. వివిధ పోలీసు స్టేషనుల్లో ఎఫ్.ఐ.ఆర్.లుగా నమోదైన 1192 కేసులతో సహా, 4153 ఎన్ఫోర్సుమెంటు కేసులను (మొత్తం 5345 కేసుల పరిష్కరించినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని, జిల్లాను అన్ని రంగాల్లోను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని అధికారులకు, సిబ్బందికి పిలుపునిచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ మెగా లోక్ అదాలత్లో 17,138 కేసులు డిస్పోజ్ కాగా, వాటిలో జిల్లా పోలీసులు 5345 కేసులను డిస్పోజ్ చేసి, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ప్రథమ స్థానంలో కర్నూలు జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లాలు నిలిచాయి. ఈ కార్యక్రమంలో సిఐడి అధిషనల్ డిజి డా. రవిశంకర్ అయ్యాన్నార్, లా అండ్ ఆర్డర్ ఐజి శ్రీ సీహెచ్.శ్రీకాంత్, ఈగల్ ఐజి శ్రీ ఆకె రవికృష్ణ, రైల్వే మరియు స్పోర్ట్స్ ఐజిపి కే.వి.మోహనరావు పలువురు ఉన్నతాధికారులు, ఇతర జిల్లాల ఎస్పీలు, ఇతర పోసు అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులానికి ట్రిపుల్ ఐటీ మంజూరు

ప్రిన్సిపల్ రాణి శ్రీ

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లిలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు వచ్చే ఏడాది విద్యా సంవత్సరం నుండి త్రిబుల్ ఐటీ మంజూరు అయిందని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రాణి శ్రీ అన్నారు. బుధవారం చీపురుపల్లి లో ఆమె విలేకరులతో మాట్లాడారు. బాలికలకు సంబంధించిన ట్రిపుల్ ఐటి తరగతులు నిర్వహణకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయి అన్నారు. నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిర్దేశిత ఆదేశాలు రావాల్సి ఉందని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ప్రస్తుతం పాఠశాలలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సుమారు 600 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా అదనంగా త్రిబుల్ ఐటీ మంజూరు కావడం విద్యార్థులకు సదవకాశమే అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా ఉపయోగించుకొని వచ్చే ఏడాది జూన్ నాటికి త్రిబుల్ ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల కానున్నదని ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం విద్యార్థులు ఉన్న సంఖ్యకు తరగతి గదులు సరిపోతున్నప్పటికీ అదనముగా త్రిబుల్ ఐటీ తరగతులు నిర్వహణకు సుమారు నాలుగు గదులు అవసరం కానున్నాయని ఇప్పటికే ప్రభుత్వానికి సంబంధిత నివేదికను అందజేశామని ఆమె తెలిపారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు ప్రభుత్వం నుంచి అనుమతులు కూడా లభించాయని ఆమె వివరించారు.

మరణించినా....అతని నేత్రాలు సజీవం

విశాలాంధ్ర-చీపురుపల్లి : కళ్ళు లేవని నీకు కలత వద్దమ్మా.. తన కళ్ళతో జగతిని చూపిస్తాడమ్మా... అంటూ ఓ సినీ గేయ రచయిత రాసిన పాట అక్షర సత్యంలా జీవం పోస్తూ, ఆ పాటలో ప్రతి పదానికి అర్థం తెలిసేలా చీపురుపల్లి ప్రాంతంలో ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై స్వచ్ఛంద అవయవదాన కార్యక్రమాలకు ముందుకు వస్తున్నారు. ఇదే కోవలో చీపురుపల్లి పట్టణంలోని జి అగ్రహారంనకు చెందిన లంక మల్లి ఆది బాబు(84) అనే రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి 8 పదుల వయసులో బుధవారం నాడు మృతి చెందారు. గతంలో చీపురుపల్లికి చెందిన మానవీహిత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా స్వచ్ఛంద అవయవ దానాలు కార్యక్రమం పైన అవగాహన కల్పించిన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు నింపిన స్ఫూర్తితో బుధవారం నాడు మరణించిన ఆది బాబు నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకుని రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ బి. వి గోవింద రాజులు కి మృతుని కుమారుడు శ్రీనివాస్ రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కి ఆదిబాబు మానవార్తను తెలియజేసారు. ఇదే క్రమంలో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి.సుజాత, సహాయకులు నంది.ఉమ శంకర్ ద్వారా అతని కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి. ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ దాత కుటుంబ సభ్యు లను రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మో హనరావు, సెక్రటరీ బి .మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్ మరియు ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానం పై అవగాహన,చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, ఈ సందర్భంగా బీవీ గోవిందరాజులు అన్నారు. అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత,ప్రజలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్వచ్ఛందముగా మరణ అనంతరం నేత్ర దానం చేయాలనుకునే వాళ్ళు 78426 99321 నంబరుకు కాల్ చేయాలని ఈ సందర్భంగా గోవిందరాజులు కోరారు.

జాతీయ స్థాయి సపక్ తక్రాకు జిల్లా విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: డెసెంబర్ 20 నుండి 26వ తేదీ వరకు కేరళలో జరగుతున్న 27వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల పోటీలకు కె.జి.బి.వి గంట్యాడ పాఠశాలలో చదువుతున్న కుమ్మరి అశ్విని (9వతరగతి), గండిమాని పవిత్ర (9వ తరగతి) విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 15వ నుండి 19వ తేదీ వరకు శిబిరం ఉరవకొండ లో శిక్షణ నిర్వహిస్తారు. వీరిని ఒలంపిక్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సీ, హెచ్ వేణుగోపాలరావులు , సపక్ తక్రా సెక్రటరీ ఎంటి రాజేష్, సైక్లింగ్ అధ్యక్షులు ఎం.ఎస్ .ఎన్ . రాజు, వి.ఇ.టీ. పి.భవాని,పి. డి. సీత అభినందిం చారు. పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

కుట్టు శిక్షణ ధ్రువపత్రాలు పంపిణి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరు నెలలు కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువపత్రాలను పంపిణి చేశారు. బుధవారం ఉల్లి వీధి ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ కార్యా లయంలో శిక్షణ పూర్తయిన 45మంది మహిళలకు ధ్రువపత్రాలను అంద జేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బలభద్రుని చెన్నయశెట్టి (నానాజీ)మాట్లాడుతూ 26 సంవత్సరాలనుండి మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. దూర ప్రాంతాలనుండి వచ్చిన విద్యార్థుల కోసం ఉచిత హాస్టల్ నిర్వహిస్తున్నట్లు, ప్రతిభ చూపిస్తున్న విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం చేయుట, పేద వైశ్య మహిళలకు వివాహం జరిపించుటకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చులు సమకూర్చడం చేస్తున్నట్లు ఇలా అనేక సేవాకార్యక్రమాలు సంఘం ద్వారా చేపడుతున్నట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షకురాలు శారద, సంఘం కార్యదర్శి పేర్ల సీతారామయ్యశెట్టి, కోశాధికారి కందుల సంతోష్, ఏడుకొండలు, వజ్రపు కృష్ణారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య కళాశాలకు ఘంటసాల పుస్తకాలు వితరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు బుధవారం కాకినాడ రామేశ్వర నగర్ కు చెందిన పల్లె -సిరి స్వచ్ఛంద సేవా సంస్థ (ఘంటసాల కళాపీఠం) ఆధ్వర్యంలో సంస్థ ఆర్గనైజింగ్ డైరెక్టర్ పి.మురళీధర్ ఘంట సాల జీవిత విశేషాలు తెలిపే పలుపుస్తకాలు కళాశాల గ్రంధాలయం కోసం వితరణ చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ కేవిఎల్ శాస్త్రికి అందజేశారు.ఈకార్యక్రమంలోఅధ్యాపకులు డి.హిమబిందు, ఏ కె.మహాలక్ష్మి, శ్రీనివాసులు, శ్రీనివాస్, సురేష్ ఎన్.రాధాక్రుష్ణ, సీనియర్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, పట్నాయక్, గురజాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో రచయిత డా.ఎంపురుషోత్తమాచార్యరచించిన పద్య గాన సౌరభం, భాగాలు ,మనఘంటసాలసంగీత వైభవం,డా.ఎంఆర్. చంద్రమౌళి రచన ఘంటసాల రాగశాల, ఎం.పురుషోత్తమాచార్యరచన తెలుగు చలన చిత్రాలలో శాస్త్రీయ సంగీతం మొదటి , రెండు భాగాలు,దుర్గా శ్రీ రామమూర్తి రచించిన మధుర గానలోల ఘంటసాల గేయకవితాశతకం, చల్లా సుబ్బారాయుడురచించిన శతాబ్ది గాయకుడు ఘంటసాల పుస్తకాలు ఉన్నాయి. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మురళీధర్, డి.వి. సుబ్బారావులు మాట్లాడుతూ ఘంటసాల సంగీతాభ్యాసం చేసిన కళాశాలకు పుస్తకాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేసారు.ప్రతివిద్యార్థి ఘంటసాల చలనచిత్ర సంగీత రంగానికి చేసిన సేవలు,ఆయన స్వరపరిచిన గీతాలలో సంగీతం తెలుసుకోవాలని విధ్యార్ధులకు సూచించారు.ప్రిన్సిపాల్ కేవిఎల్ఎన్ శాస్త్రి పుస్తకదాతలు,సంస్థ ప్రతినిధులకు క్రుతజ్ఞతలు తెలిపారు.

తాత్కాలిక బడ్డీలు తొలగింపు

విశాలాంధ్ర-విజయ నగరం అర్బన్: అనధికార నిర్మాణాలు, ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్న తాత్కాలిక బడ్డీలను ప్రణాళిక సిబ్బంది తొలగించే వేశారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక అధికారులు, సిబ్బంది ఆక్రమిత స్థలాలకు వెళ్లి వాటిని తొలగించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుదవారం దాసన్నపేటలోని ప్రధాన జంక్షన్ లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వాస్తవానికి మంగళవారం దాసన్నపేట వాటర్ ట్యాంక్ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది తొలగించి నిర్మాణ సామగ్రిని తరలించి వేశారు. ఆయన సదరు ఆక్రమితదారుడు మరలా ఈరోజు నిర్మాణాలు చేపడుతున్నట్లుగా ఫిర్యాదు రావడంతో కమిషనర్ ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది అక్కడకు వెళ్లి మరల ఆ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. నిర్మాణ పనులను నిలుపుదల చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సహకారంతో తొలగించే ప్రక్రియకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజలకు సమస్యలుగా ఉన్న ఎటువంటి అక్రమ నిర్మాణాలు గానీ, ఆక్రమిత బడ్డీలు లను గాని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. తాము తొలగించిన నిర్మాణాలను మరల చేపట్టడం మంచిది కాదని సూచించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని ప్రభుత్వానికి ప్రజల అండగా ఉండాలని కూటమి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబినాయన) పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి చెందిన పలువురు పౌరుల ఆరోగ్యసమస్యలు మరియు వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వారికి సాయం అందేలా కృషి చేసి, సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) అందజేశారు: పట్టణానికి చెందిన పిన్నింటి బ్రహ్మాజీ రూ.లక్ష 84 వేల 579లు, రామభద్రపురం మండలం, కొండ ఇంగువ గ్రామానికి చెందిన కత్తుల మహేష్ కి లిరూ45 వేలు, బొబ్బిలి మండలం, కోమటిపల్లికి చెందిన ఆవాలమోహన సాయికృష్ణ కు 38, వేల 629 లు,తెర్లాం మండలం, బూరిపేట గ్రామానికి చెందిన బి. ఆర్యవర్ధన్ కు25 వేలు అందజేశారు.

వావిలపాడు ఎంపీపీ పాఠశాలను అధికారి సందర్శన

విశా లాంధ్ర-వేపాడ: మండలంలోని వావిలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావుబుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా పాటశాల పరిసరాలు తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటగది,పాటశాల ప్రార్థనా నిర్వహణ పరిశీలించిన అంతరం విద్యార్థులతో తెలుగు,ఇంగ్లీష్ చదివించడం రాయించడం అంకెలు, సంఖ్యలు,కూడికలు,తీసివేతలు చేయించారు.విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, ఉపాద్యాయుల డైరీలు, లెస్సన్ ప్లాన్స్, టి.ఎల్.ఎమ్ మొదలగునవి పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమములో పాటశాల ప్రధానోపాధ్యాయులు జి.లక్ష్మి గారు,ఉపాద్యాయులు బి.గౌరి, సి.ఆర్. పి.లు వి.సునంద, కె.రామప్రసాద్ పాల్గొన్నారు.

కిశోరి బాలికల జీవితాలపై సరైన నిర్ణయాలు తీసుకునేలా చేయాలి

విశాలాంధ్ర-మెరకముడిదాం : కౌమార దశలో ఉన్న కిశోరి బాలికలు వారి జీవితాలపై సరైన ఎంపికలు, నిర్ణయాలు తీసుకునే విధంగా తయారు చేసే బాధ్యత మనందరిపై ఉందని, ముఖ్యంగా అంగన్వాడి సిబ్బంది పైన ఉందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జి భాస్కరరావు అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో గల సమావేశం భవనం నందు ఎంపీడీవో ఆధ్వర్యంలో మండల స్థాయి కిశోరి వికాసంపై ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో ఒక్కరోజు మండలస్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ కౌమారదశ పథకాలు, కార్యక్రమాలపై వీరికి పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. బాల్య వివాహాలు తదితర అంశాలపై వీరికి పూర్తి అవగాహన ఉండేలా తయారు చేయాలన్నారు. ఈ శిక్షణ లో పాల్గొన్న స్త్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిని యమ్. రాజేశ్వరి మాట్లాడుతూ బాల్యవివాహ రహిత సమాజాన్ని నిర్మించడానికి అందరూ సహకరించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు టి శ్రీదేవి, జె లక్ష్మి, నాగమణి, మంగ లతో పాటు మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణా కార్యదర్శులు, అంగన్వాడి కార్యకర్తలు, ఎన్జీవో ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్ లో అభివృద్ధి పనులు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్ లో కమీషనర్ జె. రామప్పలనాయుడు బుధవారం పర్యటించారు. కొలనీలో జరుగుతున్న సిసి రోడ్డు పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనెస్పెక్టర్ సిహెచ్ ప్రసాద్, సానిటరీ సెక్రటరీ భాను, పెంకి గౌరీశ్వరరావు, రేజేటిజయరాం, పరిశినాయుడు మాష్టారు, నీలన్నాయుడు మాస్టర్, అసిరినాయుడు నారాయణరావు, బలరాంనాయుడు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ అక్రమాలపైన సమగ్రత దర్యాప్తు చేపట్టాలి

ఎమ్మెల్యే బేబీ నాయన కు వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి: విశాఖ డెయిరీ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం రాజా ప్యాలస్లో హౌస్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే బేబినాయనకు రైతుసంఘం, పాల రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, పాల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్.ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ డెయిరీ సహకార రంగం నుంచి కంపెనీ చట్టంలోకి మారిన తర్వాత డెయిరీలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. యాజమాన్యం అక్రమాలతో రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఆవు పాలు ధర తగ్గించడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. డెయిరీ అక్రమాలపై ప్రభుత్వం వేసిన హౌస్ కమిటీ సభ్యులు సమగ్ర విచారణ చేసి కంపెనీ చట్టం నుంచి సహకార రంగంలోకి డెయిరీను తీసుకు రావాలని కోరారు. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని బేబినాయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేష్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నల్లబిల్లి రెవెన్యూ సదస్సులో 16 దరఖాస్తులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు16 దరఖాస్తులు అందాయని తహసిల్దార్ జె.రాములమ్మ అన్నారు.ఈ దరఖాస్తులు పట్టాదారు పాసు పుస్తకాలు,మంజూరు(ముటేషన్)పట్టాదారు పాస్ పుస్తకాలు ఆన్లైన్ కొరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఈర్లే సన్యాసమ్మ సన్యాసినాయుడు, అటవీ శాఖ అధికారి రాజేశ్వరి, డిప్యూటీ, తహసిల్దార్,కే.సన్యాసినాయుడు, ఆర్ఐ.రామలక్ష్మి,మండల సర్వేయర్ గంగాధర్, సబ్ రిజిస్టర్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కె.నూక రత్నం వీఆర్వోలు,తాతారావు,డెక్క ప్రసాదు,శ్రీనివాస్ మిరియాల ఈశ్వరరావు, బి.సన్యాసినాయుడు ,అప్పారావు, అప్పల రాము, వీఆర్ఏలు అశోక్, గుమ్మాల రాము, సచివాలయ సర్వేయర్లు అరవిందు, నవీన్ శివ సచివాలయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓ ప్రైవేటు రిసార్ట్ లో బస చేయనున్న పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-భోగాపురం : ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సవరవల్లి సమీపంలోని సన్ రే రిసార్ట్ లో గురువారం రాత్రి బస చేయనున్నారు. శుక్రవారం సన్ రే రిసార్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా మన్యం జిల్లాకి వెళ్లి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి నేరుగా ఈ రిసార్ట్ కు గురువారం సాయంత్రం చేరుకోనున్నారు. రెవెన్యూ అధికారులు ఈయన విడిదికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. రిసార్టులో మరో ప్రక్క పోలీస్ యంత్రాంగం కూడా బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరం డిఎస్పి శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం రిసార్ట్ ను పరిశీలించారు.

విద్యార్థి జీవితానికి ఇంటెన్షిప్ వారధి వంటిది : ప్రిన్సిపల్

విశాలాంధ్ర-రాజాం: ఇంటర్న్షిప్ ప్రోగ్రామ్ విద్యార్థులకు చాలా ఉపయోగకరమైనదని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్వప్న హైందవి చెప్పారు. డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్షిప్ ప్రోగ్రామ్ ఆవశ్యకత గూర్చి సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు నైపుణ్యాలను మెరుగు పరచేందుకు ఈ కార్యక్రమం చాలా అవసరమ నస్సుకు 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతీ టీమ్ కు ఓ అధ్యాపకులు పర్యవేక్షి క్రమం తప్పకుండా ప్రతీ విద్యార్థి. వారికి కేటాయించిన సంస్థలో నైపుణ్యాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. విద్యార్థి జీవితానికి ఈ కార్యక్రమం 'వారధి' వంటిదని చెప్పారు. కావున చక్కగా విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డా. ప్రసాదరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండండి

వ్యవసాయ అధికారి నిర్మల

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో ఈ నెల 18 వ తేదీ నుండి (రేపటి నుండి) 20వ తేదీ వరకు వాతావరణ శాఖ వారి తుఫాను హెచ్చరిక ఉన్నందువలన మండలంలోని ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు ఈ విషయాలను మండల వ్యవసాయ అధికారి పి నిర్మల మండలంలోని రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు రైతులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. రేపటినుండి 20వ వరకు తుఫాను కారణంగా వర్షాలు పడే అవకాశం ఉండడం వలన అందరూ రైతులు వారి యొక్క వరి పంట కోతలను, నూర్పిడిలను వాయిదా వేసుకొనవలెను. కోసిన వరి పంట పనల మీద ఉన్నట్లయినా వెంటనే చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకోనవలెను. ఇప్పటికే పంట నూర్పిడి చేసి, రాసులుగా ఉన్న ధాన్యాన్ని ,వెంటనే ధాన్యం కొనుగోలు నకు దగ్గరలోని రైతు సేవా కేంద్రపు వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించినట్లితే వాళ్ళ గోనే సంచులను ఇచ్చి , కొనుగోలునకు మరియు , మిల్లు వద్ద కానీ ,దగ్గరలోని ఎం పి ఎఫ్ సి గోదాముల్లో దాచుకొనే విధముగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు వారి ద్వారా ఆదేశాలు జారీ చేయబడ్డాయి. అందువలన రైతు సోదరులందరూ తమ యొక్క వరి పంట నూర్పులను మరియు కోతలను వాయిదా వేసుకుని వాటిని జాగ్రత్తగా టార్పాలిన్స్ కప్పి ఈ మూడు రోజులు వరి పంట నష్టము జరగకుండా కాపాడుకోవలసినదిగా జాగ్రత్తగా ఉండవలసిందిగా జిల్లా వ్యవసాయ అధికారి వారు తెలియజేసారు. ప్రతీ రైతు సేవా కేంద్రము యొక్క వ్యవసాయ సహాయకులందరూ ఈ విషమును ఆయా గ్రామాలలోని టామ్ టాం ద్వారా రామలయాల్లోని మైకుల ద్వారా విస్తృతముగా ప్రచారము చేయాలని అదేశించడము జరిగింది. వ్యవసాయ సహాయకు అందరు రైతులకు అందుబాటులో ఉంటూ వాతావరణ పరిస్తితులపై అప్రమత్తముగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వారు అదేశించడము మరియు ఎప్పటికప్పుడు పరిస్థితులపై సంభందిత సమాచారాన్ని పై అధికారులకు చేరవేయాలని అదేశించడమైంది.

బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన బుధవారం బొబ్బిలి కోట లో బూరిపేట గ్రామ కాపురస్తులు బొమ్మలాట పాపారావు కుమారుని ఆరోగ్య పరిస్థితి బాగోలేదని బూరిపేట గ్రామ పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి నెలరోజుల క్రితం తీసుకొని వెళ్ళారు. తనకు బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి చెక్కును అందజేయడం జరిగింది. దాంతోపాటు తన సొంత నిధులు 10,000 రూపాయలు సాయం చేశారు. 22

విజయనగరంలో సినీ నటి శ్రీ లీల చే చెన్నై షాపింగ్ మాల్ బ్రాంచి ప్రారంభం

విశాలాంధ్ర- విజయ నగరం ఫోర్ట్: విజయ నగరంలో చెన్నై షాపింగ్ సినీనటి శ్రీలీలచే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాల్లో నూతన ఒరవడితోపాటు అన్నివర్గాల ప్రజల మనస్సులకు అనుకూలంగా ఉండే అన్ని రకాల వస్తువులను అందించే చెన్నై షాపింగ్ మాల్ ఇకపై విజయనగరం జిల్లా వాసులకు పరిచయం కానుంది అని అన్నారు. మార్కెట్ రంగంలో అగ్రగామిగా ఉన్న విజయ నగరంలో చెన్నై షాపింగ్ మాల్ అడుగుపెట్టిందని అన్నారు. ఇప్పటికే మాల్కు సంభందించి అన్ని వయసుల వారికి, అవసరమైన వస్తువులను, ముఖ్యంగా వస్త్రాలను, జ్యూవెలరీని అందుబాటులోకి తెచ్చారని. ప్రారంభం సందర్భంగా పలురకాల వస్తువులపై డిస్కౌంట్ను ప్రకటించారు.రూ.99నుంచి ధరలు ప్రారంభమవుతాయని ప్రతీ ఒక్కరు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అతికి విజయలక్ష్మి గజపతిరాజు మాల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- గజపతినగరం : మండలంలోని గంగ చోట్ల పెంట గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు కే మహారాజన్ బుధవారం గ్రామాన్ని సందర్శించి అక్కడ రైతులతో మాట్లాడటం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు నూర్చిన పంట మీద కప్పడం కోసం ఇవ్వడాన్ని గమనిం చారు. రైతులందరూ వరి పంట కోతలను నూర్పిడిలను వాయిదా వేసు కోవాలని కోసిన వరి పంట పనుల మీద ఉన్నట్లయినా వెంటనే చిన్నచిన్న కుప్పలుగా పెట్టుకోవాలని ఇప్పటికీ పంట నూర్పిడి చేసి రాశులుగా ఉన్న ధాన్యాన్ని వెంటనే ధాన్యం కొనుగోలునకు దగ్గర్లోని రైతు సేవ కేంద్రపు వ్యవసాయ సహాయ కులను సంప్రదించి వాళ్ళ గోనే సంచల నుంచి కొనుగోలునకు మరియు మిల్లు వద్ద కానీ దగ్గరలోని ఎంపీ ఎఫ్ సి గుదాముల్లో దాచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు జారీ చేయ బడ్డాయని తెలిపారు. అందువల్ల రైతు సోదరులందరూ తమ యొక్క వరి పంట నూర్పును కోతలను వాయిదా వేసుకుని వాటిని జాగ్రత్తగా తార్పాలిన్లు కప్పి ఈ మూడు రోజులు వరి పంటనష్టం జరగకుండా కాపాడుకోవలసిందిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి, టెక్నికల్ ఏవో బి లోకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్, గ్రామ సర్పంచ్ బోని సంగమయ్య గ్రామ పెద్దలు కనక ల పైడన్న మరియు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు. టిఏ లకు అవగాహన

విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం ఏపీ సిహెచ్ రామారావు ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు లకు బుధవారం సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి బి ఎల్ డి ఓ కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వారికి తగు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని పని లేని వారికి పని కల్పించాలని రికార్డులు సక్రమంగా నివేదించాలని తగు సలహాలు అందజేశారు ఈ కార్యక్రమంలో మండలంలోని టి ఏ లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డా.వావాను కలిసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లా కేంద్రానికి చేరుకున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డా.పి.పి.వావా ను జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బుధవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో వారి కోసం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాల అమలు పై చర్చించారు. జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్ లతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఎల్.డి.ఎం., బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు ఎస్పీ సౌమ్యలత కూడా సభ్యుడిని కలిశారు.

సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ విషయంలో రాజకీయ కోణం సరికాదు

విశాలాంధ్ర విజయనగరం పోర్ట్: విజయనగరం జిల్లా మహారాజ కోట వెనుక జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చోడి ఆదినారాయణ మాట్లాడుతూ మొన్న జరిగిన ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ విషయంలో రాజకీయం చోటు చేసుకోవడం చాలా దురదృష్టకరమని ఆవేదన వెలబుచ్చారు. దేశం కోసం, సమాజం కోసం, ప్రజల కోసం, తమ జీవితాలను పణంగా పెట్టిన వ్యక్తులు పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం కలిగి ఉండాలని కోరారు. వారి యొక్క జయంతి వర్ధంతి కార్యక్రమంలో రాజకీయాలకు చోటు లేదని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో ప్రముఖుల విగ్రహావిష్కరణ జరిగేటప్పుడు అన్ని రాజకీయ పార్టీ వ్యక్తులు ప్రముఖులు పాల్గొనడం సర్వసాధారణమని తెలిపారు. దురదృష్టం ఏమిటంటే నూజివీడులో జరిగిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కు విచ్చేసిన వైఎస్ఆర్ సీపీ, తెలుగుదేశం పార్టీ, ప్రజా సంఘ నాయకులు, పాల్గొనడం జరిగిందని తెలిపారు. సభ నిర్వాహకులు ఆహ్వానం మేరకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పాల్గొనడం జరిగిందని తెలిపారు. అనుకోకుండా తెలుగుదేశం వైఎస్ఆర్సిపి నాయకులు ఒక వేదికని పంచుకోవడం జరిగిందని తెలిపారు. ప్రముఖుల విగ్రహావిష్కరణ విషయంలోనూ, వర్ధంతి జయంతి

కార్యక్రమాలు నిర్వహించడం విషయంలోనూ ప్రజలందరూ నాయకులందరూ పార్టీలు కతీతంగా పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విషయములో కూడా రాజకీయ కోణం చూడడం చాలా దురదృష్టకరమైన తెలిపారు. దేశం కోసం రాష్ట్రం కోసం సమాజం కోసం ప్రజల కోసం పనిచేసిన వ్యక్తుల విషయంలో రాజకీయాలు చేయరాదని తెలిపారు. ఇలాంటి రాజకీయ ఆరోపణలను రాష్ట్ర యాత శెట్టి బలిజ, శ్రీశైన, గౌడ, ఈడిగా సేవా సంఘం ఖండిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు గొప్ప అప్పలరాజు, యువత నాయకులు చుక్క గణేష్ గౌడ్, దిమిలి పైడ్రాజు, చిన్న, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలి : పి రామ్మోహన్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో 2019 లో ఏర్పాటు అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటి వరకు సొంత భవనం లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పూడి రామ్మోహన్ విమర్శించారు. స్థానిక బుధవారం స్థానిక ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎల్బిజీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ నగరంలో పేద విద్యార్థులు విద్య నీ అభ్యసించే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేదని , విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తరగతి గదులు లేక విద్యార్థులకు ఒక పూట మాత్రమే తరగతులు నిర్వహించడంతో , కోర్సులు పూర్తి అవ్వక అరకొర చదువులు సాగుతున్నాయని విమర్శించారు. కళాశాల తరగతులు సంస్కృత కళాశాలలో నిర్వహిస్తున్నారని , దానితో అటు సంస్కృత కళాశాల విద్యార్థులు ,ఇటు డిగ్రీ కళాశాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని విమర్శించారు. ఒక పక్క ల్యాబ్ లు పూర్తి స్థాయిలో జరగక విద్యార్థులు చదువులు ఎందుకు చదువుతున్నారో తెలీకుండా చదువుతున్నారని విమర్శించారు. తక్షణమే పట్టణ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆర్ అండ్ బి స్థలంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని,ఆ కళాశాలలో చదివే విద్యార్థులకు ఆదర్శ్ డిగ్రీ కళాశాల తరహాలో హాస్టల్స్ కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. భవనం నిర్మాణం అయ్యేవరకు తాత్కాలికంగా పట్టణ కేంద్రంలో ఏదైనా అద్దె భవనంలో తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కళాశాలకు సొంత భవనం కోసం జరిగే విద్యార్థుల పోరాటంలో పట్టణ ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కోసం ఇప్పటికే పలు నిరసన కార్యక్రమాలు చేశామని , ప్రభుత్వం స్పందించని యెడల వీటిని ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి చిన్న బాబు, జె రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చామలాపల్లి శాశ్వత డీలర్ నియామకానికి నోటిఫికేషన్

మండల సివిల్ సప్లై డీటీ రామకృష్ణ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామానికి శాశ్వత పద్ధతిలో రేషన్ డిపో డీలర్ నియామకానికి విజయనగరం ఆర్డిఓ డి.కీర్తి నోటిఫికేషన్ జారీ చేశారని మండల సివిల్ సప్లై డి.టి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఓసి క్రీడల కోటాలో వారికి ఈ డీలర్ పోస్ట్ ను కేటాయించారని తెలిపారు.చామలాపల్లి గ్రామ నివాసియై ఉండి ఇంటర్మీడియట్ పాసైన వారు అర్హులన్నారు.ఈ పోస్టుకు సంబంధించి అర్హులు వచ్చే నెల 23వ తేదీ లోగా వారి యొక్క దరఖాస్తును మండల రెవిన్యూ కార్యాలయంలో వేపాడ నందు లేదా విజయనగరం ఆర్డీవో కార్యాలయంలో కానీ అందించాలని ఆయన చెప్పారు.

రాజాం 6వ వార్డులో రెవిన్యూ సదస్సు

విశాలాంధ్ర-రాజాం: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ, ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రెవెన్యూ సదస్సులలో" భాగంగా నేడు పురపాలక సంఘ పరిధి 6వ వార్డ్ సారధి ఇందిరమ్మ సచివాలయంలో మండల ఎగ్జిక్యూటివ్ తహసీల్దార్ కృష్ణంరాజు, ఆర్ఎస్ డిటి అనంత్, మున్సిపల్ సర్వేర్ సత్యనారాయణ, మండల సర్వేయర్ పోలిపల్లి,సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరై తమ సమస్యలను రెవెన్యూ అధికారులకు నివేదించడం జరిగింది, ప్రభుత్వ నిబంధనలు మేరకు నిర్దేశించిన గడువు లోపల సమస్యను పరిష్కరించి రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, నీటి సంఘం ప్రెసిడెంట్ అడపా శ్రీను, నీటీ సంఘ సభ్యులు మిత్తిరెడ్డి మధుసూదనరావు, టంకల కన్నంనాయుడు, పొట్నూరు గౌరీ నాయుడు, వావిలపల్లి రంగనాథం, మజ్జి తాత, పల్లి శ్రీరాములు, రౌతు మణికంఠ, అడపా మహేష్, టంకాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వంద లీటర్లు బెల్లం ఉటలు ధ్వంసం చేసిన సీఐ చిన్నమనాయుడు

విశాలాంధ్ర-బొబ్బిలి : మండల పరిధిలోని కోయ్య కొండవలస గ్రామంలో

సుమారు 100 లీటర్ల బెల్లపు ఊటలను ఎక్సైజ్ శాఖ సీఐ పామోటి చిన్నమనాయుడు సిబ్బందితో ధ్వంసం చేసినట్లు విలేకరులకు తెలిపారు.ఈ దాడులు లో ఇన్స్పెక్టర్ ఏ .శ్రావణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్ ల వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు రక్షణకై సిఎస్ఆర్ నుండి ఎక్విప్మెంట్ కు చర్యలు

కోస్టల్ సెక్యూరిటి పోలీస్ జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: చింతపల్లి, చేపల కంచెరు, ముక్కాం బీచ్ లలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబెడ్కర్ మత్స్య శాఖ డి డి కు ఆదేశించారు. చింతపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధి లో నాలుగు బీచ్ లు ఉన్నాయని, ఆదివారాల్లో, మరి కొన్ని ప్రత్యేక దినాల్లో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారని, ఈ బీచ్ ల వద్ద గజ ఈతగాళ్ళు ఉండాల్సిన అవసరం ఉందని మెరైన్ ఎస్.పి రవివర్మ కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ పంచాయతీ శాఖ ద్వారా చెల్లించుటకు అవకాశం ఉందని, నెలలో 4 రోజులు బీచ్ ల వద్ద పని చేయడానికి గజ ఈతగాళ్లను గుర్తించాలని మత్స్య శాఖ డిడి కు సూచించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో కోస్టల్ సెక్యూరిటి పోలీస్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. అత్యవసర రక్షణకు లైఫ్ జాకెట్స్ అవసరం ఉందని, అలాగే ఒక బోట్ కూడా కావాలని మెరైన్ పోలీస్ వారు కలెక్టర్ ను కోరగా, లైఫ్ సేవింగ్ ఎక్విప్మెంట్ కోసం

లేఖ ద్వారా రాస్తే సి.ఎస్.ఆర్ క్రింద ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చింతపల్లి పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు కానీ గేట్ ఏర్పాటు చేయలేదని సి.ఐ తెలుపగ సమగ్ర శిక్ష ఇంజినీర్లను పిలిచి వెంటనే గేట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తీర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి వాటర్ స్పోర్ట్స్ కోసం అనువైన ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ కోరారు. అలాగే సీ ప్లేన్ కు అవకాశాలు ఉన్నాయేమో కూడా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో మెరైన్ ఎస్.పి రవి వర్మ, జిల్లా అదనపు ఎస్.పి సౌమ్య లత, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిపిఓ వెంకటేశ్వరరావు, ఫిషరీస్ డి డి నిర్మలా కుమారి, మెరైన్ పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ఓదార్పు

విశాలాంధ్ర-బొబ్బిలి: ఆర్మీ విధులు నిర్వహిస్తూ వీర మరణం పొందిన సైనికుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారం ప్రభుత్వం తరపున అందిస్తామని రాజ్య సైనిక సంక్షేమ డైరెక్టర్ బ్రిగేడియర్ వి. వెంకటరెడ్డి (రిటైర్డ్) విఎస్ఎం అన్నారు. ఆయన బుధవారం విజయవాడ నుండి విజయనగరం సైనిక సంక్షేమ కార్యాలయం కు వార్షిక తనిఖీలలో భాగంగా రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అమర జవాన్ల బాడంగి మండలం బోచ్చవానివలస వలస గ్రామనికి చెందిన సి యఫ్ ఎన్ గొట్టాపు శంకర్రావు కుటుంబన్ని, బొడ్డవలస గ్రామం చెందిన నాయక్ తేలు దినేష్ కుటుంబాలను సైనిక సంక్షేమ సంచాలకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేతులు మీదగా వీర జవాన్ ల కుటుంబల భార్యలకు రూ.50వేలు, వారి తల్లిదండ్రులకు రూ.50 వేలు చెప్పున సాయుధ దళాల నిధుల నుండి సైనిక సంక్షేమ శాఖ తరుపున చెక్కు రూపంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాలకు సైనిక సంక్షేమ ల కొరకు వివరించారు . అలాగే ఈ సి హెచ్ ఎస్ హాస్పటల్ సదుపాయాలు , స్కూల్ ఫీజు బెనిఫిట్స్ తదితర అంశాలపై వివరించారు..ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ రాజారావు, మాజీ జిల్లా సైనిక సంక్షేమ అధ్యక్షులు సబ్బన సతీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ జి రమేష్ తదితరులు పాల్గున్నారు.

ఆరోగ్యం పోసణపై మహిళలకు అవగాహన అవసరం

ప్రకృతి వ్యవసాయ డిపిఎం ఎం.ఆనంద్ రావు.

విశాలాంధ్ర-వేపాడ : ఆరోగ్యం పోషణపై మహిళలకు పూర్తిస్థాయి అవగాహన అవసరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి ఎం ఆనందరావు అన్నారు.మండల కేంద్రమైన వేపాడ మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో మండలంలో ప్రత్యేకంగా గుర్తించిన ఆకుల సీతంపేట వీలుపర్తి గ్రామాల ఆరోగ్య మహిళ సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిపిఎం మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అవసరం అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యం ఆహారం భద్రత అనే అంశంపై ప్రకృతి వ్యవసాయం విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించింది అన్నారు. ఈ మేరకు హెూమ్ సీడ్ ఫుడ్ తయారీ వాతావరణంలో వచ్చే మార్పులు గురించి, ఫుడ్ బాస్కెట్ గురించి, ఇనిస్ట్యూట్ లింకేజి గ్రామ సంఘాలలో ప్రకృతి వ్యవసాయం అనుసంధానంతో ఏ విధమైన మార్పులు తెచ్చుకోవచ్చు అనే అంశాలపై శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ వెంకట సత్యం ఎస్ఆర్పి ఎస్ ఎఫ్ ఏ శోభ, ఏమిటి సరోజినీ మండల రైతు భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: డిసెంబర్ 21 నుండి డిసెంబర్ 23 వ తేదీ వరకు విజయవాడ పట్టణం నందు ఐజీ మున్సిపల్ స్టేడియం లో డీఎస్ఎ హాలు నందు జరగబోయే రాష్ట్ర స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు ఏపీ స్టేట్ టీమ్ ఎంపికలు కు ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారులు గూగుల్ షీట్ లో ఆన్లైన్ ఎన్రోల్మెంట్ కొరకు 19వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి కస్ప స్కూల్ లో జరుగును క్రీడాకారులకు టెక్నికల్ సహాయం కొరకు డివి చారి (ప్రసాద్) గారిని సంప్రదించాలని, ఆధార్ కార్డు పుట్టిన ధ్రువీకరణ పత్రంతో 18 సంవత్సరాల లోపు వారు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఐ)వారి గుర్తింపు కార్డుతో హాజరు కావలెను. 18 సంవత్సరాలు నిండిన వారు ఎఫ్ఎఐ గుర్తింపు కార్డుతో పాటు గతంలో పాల్గొన్న ఫెన్సింగ్ క్రీడ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ తో నిజమైన ఫెన్సింగ్ క్రీడాకారులు మాత్రమే హాజరు కావలెను మరిన్నివివరములుకు ౦91 83747 37707 నెంబర్లో సంప్రదించ వలెనని ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి జీఎస్వి కృష్ణ మోహన్ తెలియ చేశారు.

సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో హెల్త్ అసిస్టెంట్ లకు ఊరట

విశాలాంధ్ర-భోగాపురం: ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు మేరకు తొలగించిన హెల్త్ అసిస్టెంట్ లను తిరిగి నియమించుకోవాలని బుధవారం సుప్రీం కోర్ట్ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు పై ఏ. పి.ఎన్. జి. ఓ భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మురు దుర్గారావు హర్షం వ్యక్తం చేశారు.ఈ నెల 5 న వైద్య శాఖ హెల్త్ అసిస్టెంట్ లను రాష్ట్రం లో సుమారు 1200 మందిని ఒక్కసారిగా తొలగించిన సంగతి విదితమే.సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులు హెల్త్ అసిస్టెంట్ లకు ఊరట నిచ్చిందని దుర్గారావు అన్నారు.